సాక్షి సూర్యాపేట

గురువారం । 6 । జూన్ । 2024



నకిలీ విత్తనాల ముఠా అరెస్టు

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

- 8లో



చెన్నై నుంచి మిర్యాలగూడకు

విదేశాల నుంచి అక్రమంగా బంగారం తెచ్చే వారినుంచి కొనుగోలు చేసి మిర్యాలగూడకు తెస్తున్నట్లు తెలిసింది.

- 10లో

గరిష్టం / కనిష్టం
37⁰ / 26⁰

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పది సప్లిమెంటరీ పరీక్షకు 13 మంది హాజరు

సూర్యాపేటటౌన్ : జిల్లాలో బుధవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 13 మంది విద్యార్థులు హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 49 మంది విద్యార్థులకు 36 గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్‌తో పాటు సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు.

మహిళల చైతన్యానికి శిక్షణ తరగతులు దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న స్వరూప

భానుపురి (సూర్యాపేట) : మహిళల చైతన్యానికి శిక్షణ తరగతులు దోహదపడుతాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.స్వరూప, సీహెచ్.శిరోమణి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన పీఓడబ్ల్యూ ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 2,3 తేదీల్లో నిర్వహించిన పీఓడబ్ల్యూ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు ప్రతి ఒక్కరికీ ఉపయోగ పడుతాయన్నారు. సమాజంలో జరుగుతున్న అణచివేత, వివక్షత నుంచి ప్రతి మహిళ తనను తాను కాపాడుకోవాలన్నారు. శిక్షణ తరగతుల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ, రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రేణుక, శోభ, జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, ఐతరాజు పద్మ పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన , నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు పోయడం తదితర కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూర్రు మట్టపల్లిరావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు క్రిష్ణమాచార్యులు , పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, బ్రహ్మచార్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా టీ10 ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

హుజూర్‌నగర్ : తెలంగాణ వైఖానస ఆగమ పరిషత్ ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న టీ10 ప్రీమియర్ లీగ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భృగు వారియర్స్, అది ఛాలెంజర్స్, డీవీఎస్ 1, డీవీఎస్ 2, వైఖానస రైజర్స్ జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేస్తామని వారు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు

నల్లగొండ రూరల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్టీసీ రీజియన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లకు బుధవారం నల్లగొండ డిపోలో ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్ నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

లెక్కింపు.. కొనసాగింపు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రారంభం

- సాయంత్రం 4 గంటల వరకు బండిల్స్ కట్టే ప్రక్రియ
- 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- అర్ధరాత్రి ఒంటి గంటకు వెలువడిన మొదటి రౌండ్ ఫలితం
- 7,670 ఓట్ల ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాలను కట్టలు కడుతున్న ఎన్నికల సిబ్బంది

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి కౌంటింగ్ బుధవారం ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లోని బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్స్‌కు తీసుకొచ్చారు. నాలుగు హాళ్లలో ఏర్పాటు చేసిన 96 టేబుళ్లపై 25 ఓట్లను ఒక్క బండిల్‌గా కట్టారు. ఈ ప్రక్రియ 4 గంటల వరకు సాగింది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. కౌంటింగ్ ప్రక్రియను ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జా, నల్లగొండ కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి పర్యవేక్షిస్తున్నారు.

పోటీలో 52 మంది..

పట్టభద్రుల ఎంఎల్‌సీ ఉప ఎన్నిక పోలింగ్ గత నెల 27న జరిగింది. మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అందులో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేష్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఈ ఎన్నికల్లో మొత్తం 4,63,839 ఓట్లకు గాను 3,36,013 ఓట్లు పోలయ్యాయి.

96 టేబుళ్లపై లెక్కింపు

బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రారంభమైన మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ ప్రక్రియలో మొదటి రౌండ్ ఫలితం రాత్రి ఒంటి గంట



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వస్తున్న ఎన్నికల పరిశీలకుడు, కలెక్టర్, ఎస్పీ తదితరులు



ఏజెంట్లకు బ్యాలెట్ పత్రాన్ని చూపిస్తున్న సిబ్బంది

కు వెల్లడైంది. ఓట్లను 96 టేబుళ్లపై టేబులుకు వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్లను లెక్కిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 4 రౌండ్లలో పూర్తవుతుంది. ఈ ప్రకారం పోలైన 3,36,013 ఓట్లను లెక్కించడానికి 3 రౌండ్లలో టెబుల్‌కు వేయి ఓట్ల చొప్పున, 4వ రౌండ్‌లో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కించనున్నారు. 4 రౌండ్లలో మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ పూర్తవుతుంది. గురువారం ఉదయం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

ఓట్ల లెక్కింపు ఇలా..

పోటీ చేసిన 52 మంది అభ్యర్థులకు సంబంధించిన ప్రత్యేక బాక్సులను ప్రతి టేబుల్‌పై ఉంచుతున్నారు. చెల్లని ఓట్లకు సంబంధించి మరో బాక్సు ఉంచారు. ఇలా వెయ్యి ఓట్లలో ఒక్కో బ్యాలెట్ పేపర్‌ను తెరిచి ఎవరికి మొదటి ప్రాధాన్యత ఓటు పడిందో.. అక్కడి ఏజెంట్లకు చూపించి ఆ అభ్యర్థి బాక్సులో ఆ ఓటు పెడుతున్నారు. చెల్లని ఓటు వస్తే ఏజెంట్లకు చూపి చెల్లని ఓట్ల బాక్సులో వేస్తున్నారు. ఇలా ఆ టేబుల్‌పై మొదటి ప్రాధాన్యతలో వెయ్యి ఓట్లలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనేది లెక్క చేయడంతో పాటు చెల్లని ఓట్లు ఎన్ని అనేది లెక్క చేసి చూపుతారు. ఇలా 96 టేబుళ్లపై కౌంటింగ్ ప్రక్రియ సాగుతోంది. ప్రతి టేబుల్‌పై అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, చెల్లని ఓట్లు అన్నీ సరి చూసుకుని ఆ రౌండ్ ఫలితం ప్రకటిస్తారు.

మొదటి ప్రాధాన్యతలో గెలువకపోతే..

మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ పూర్తయిన తర్వాత చెల్లని ఓట్లను తీసివేసి చెల్లిన ఓట్లలో సగానికి ఒక ఓటును కలుపుతు గెలుపు టార్గెట్ నిర్ణయిస్తారు. ఆ టార్గెట్ ప్రకారం మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా మెజార్టీ వస్తే అతడిని గెలిచినట్లు ప్రకటిస్తారు. లేదంటే ఎలిమినేషన్ పద్ధతిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నారు. అలా జరిగితే కౌంటింగ్ ప్రక్రియ గురువారం రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది.

మొదటి రౌండ్ ఫలితాలు ఇలా..

మొదటి రౌండ్‌లో 96,097 ఓట్లను లెక్కించగా అందులో చెల్లిన ఓట్లు 88,369 ఉన్నాయి. 7,728 ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లిన ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 36,210 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 28,540 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 11,395 ఓట్లు పడ్డాయి. మొదటి రౌండ్‌లో తీన్మార్ మల్లన్న 7,670 ఓట్ల మెజార్టీ సాధించారు.

నేటి నుంచి బడిబాట

- 19వ తేదీ వరకు కొనసాగింపు
- 14రోజుల పాటు వివిధ కార్యక్రమాలు
- ఇంటింటి ప్రచారం నిర్వహించనున్న ఉపాధ్యాయులు



సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ గురువారం నుంచి ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనుంది. తమ స్కూళ్లు సాధించిన విజయాలు, బోధనా పద్ధతులు, వసతులను తల్లిదండ్రులకు వివరించి పిల్లలకు ప్రవేశాలు కల్పించనున్నారు. రోజుకో ప్రత్యేక కార్యక్రమంతో ముందుకుసాగనున్నారు.

రోజూ వారి కార్యక్రమాలు ఇలా..

జిల్లాలో 950 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. గురువారం ప్రొఫెసర్ జయశంకర బడిబాట నమోదు డ్రైవ్‌పై చర్చించేందుకు గ్రామ స్థాయిలో గ్రామ సంస్థలతో సమావేశం నిర్వహిస్తారు. అన్ని స్వయం సహాయక బృందాలు, అమ్మ ఆదర్శ కమిటీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాత విద్యార్థులను కలుపుకొని బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు.

- 7వ తేదీన పాఠశాలల్లో చేర్పించడం కోసం గ్రామంలోని పాఠశాల వయసు పిల్లల ప్రతి ఇంటిని సందర్శించాలి. పాఠశాలకు వెళ్లే పిల్లల జాబితాను సిద్ధం చేయాలి. పాఠశాలల్లో బడీడు పిల్లలను చేర్పించేందుకు ఇంటింటికీ ప్రచారం చేయాలి.
- 8, 10 తేదీల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా ప్రభుత్వం అందించే ప్రయోజనాలు, వారి చదువు కొనసాగింపు కోసం పాఠశాలల్లో సౌకర్యాలపై బ్రోచర్‌లు, కరపత్రాలు, తదితర వాటితో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- 11వ తేదీన పాఠశాలల్లో 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు షెడ్యూల్ చేయబడిన రోజు వారీ కార్యకలాపాలపై చర్చించడానికి, పాఠశాల వయసు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి.
- 12వ తేదీన బడిబాట ప్రాముఖ్యతను ఆవాసాల్లోని ప్రజలు గుర్తించేలా పాఠశాలలను ఆకర్షణీయంగా అలంకరించాలి. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, సంఘాలను కలుపుకొని గ్రాండ్ పేరెంట్ మీటింగ్ నిర్వహించాలి.
- 14వ తేదీన బడిబాట, విద్య ప్రాముఖ్యతను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజాప్రతినిధులు, ఏఏపీసీ సభ్యులు, తల్లిదండ్రులను సామూహిక అక్షరాభ్యాసానికి ఆహ్వానించాలి.
- 15న సమగ్ర విద్యా దినోత్సవం, బాలికా శిశు విద్యా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం, వారిని పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- 18వ తేదీన పాఠశాలల్లో మొక్కల పెంపకానికి స్థలాన్ని ఎంపిక చేసి, తరగతుల వారీగా కొన్ని మొక్కలు నాటాలి. పిల్లలు ఏడాది పొడవునా ఈ మొక్కలను జాగ్రత్తగా చూసుకోవాలి.
- 19న అన్ని తరగతుల విద్యార్థులు పాల్గొనేలా వివిధ క్రీడా కార్యకలాపాలు నిర్వహించాలి.

'నకిలీ' లెక్చరర్లపై విచారణకు ఆదేశం

నల్లగొండ: నకిలీ సర్టిఫికెట్లతో రెగ్యులరైన కాంట్రాక్టు లెక్చరర్లపై విచారణ చేయాలని విజిలెన్స్ అధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసిన సమయంలో ప్రభుత్వానికి కొందరు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారు. ఈ విషయంపై ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి నేత వేముల శేఖర్‌తోపాటు ఆ సంఘం నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో నకిలీ సర్టిఫికెట్లు పెట్టి రెగ్యులర్ అయిన 16 మందిని తొలగించారు. అయితే మరో పదిమంది అక్రమ పద్ధతిలో ఉద్యోగాలు పొందారని సమితి నాయకులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు ఇంటర్మీడియట్ ఆర్‌జేడీని విచారణ చేయాలని ఆదేశించారు. దీంతో రెగ్యులర్ అయిన కాంట్రాక్టు లెక్చరర్లు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హైదరాబాద్‌కు రావాలని నల్లగొండ, ఇతర జిల్లాల ఆర్ఐఓలకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది.

ప్రజల విశ్వాసంతోనే కాంగ్రెస్ విజయం



మాట్లాడుతున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కొద్దిరోజులకే ప్రభుత్వం చేపట్టిన పనులపై ప్రజలకు విశ్వాసం ఉండడంతోనే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థులు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం వెనుక పార్టీ కార్యాకర్తలు, నాయకులు, ప్రజల కృషి ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నుంచి రూ.100 కోట్లు ఖర్చుచేసి జగదీష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాడని కానీ నైతికంగా మాత్రం తామే గెలిచామన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో 70వేల మెజార్టీని తీసుకొచ్చామని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన జగదీష్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కాలంలో జగదీష్‌రెడ్డి ఏ శాఖపై సమీక్ష చేయలేదన్నారు. జగదీష్‌రెడ్డి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేస్తే కాంగ్రెస్ పార్టీకి లక్ష మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రుల సహకారంతో వివిధ శాఖలపై సమీక్షించి గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని బయటపెట్టి అభివృద్ధికి పునాదులు వేస్తామన్నారు. పేదలకు కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నవారికి దళితబంధు ఇచ్చారని, ఇలా అన్ని పథకాల్లోనూ అవినీతి జరిగిందన్నారు. వీటిపై విజిలెన్స్ కమిషన్ వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్‌రహీం, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, నాయకులు కాకి కృపాకర్‌రెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్, ధరవాత్ వీరన్ననాయక్ పాల్గొన్నారు.

గ్రూప్ –1కు సన్నద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, డీఈఓ అశోక్, అదనపు ఎస్పీ

- 9వ తేదీన పరీక్ష
- 32 కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 9,745 మంది అభ్యర్థులు

భానుపురి (సూర్యాపేట) : గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈనెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష సజావుగా సాగేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఎస్.వెంకటరావు ప్రత్యేక దృష్టి సారించారు. సూర్యాపేట జిల్లాలో ఈ పరీక్షను 9,745 మంది అభ్యర్థులు రాయనున్నారు. వీరికోసం 32 కేంద్రాలను గుర్తించారు. అభ్యర్థులు గందరగోళానికి గురికాకుండా పరీక్ష కేంద్రాన్ని ఒకరోజు ముందుగానే సందర్శించాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు.

వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు..

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణను జిల్లా అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. హాల్ టికెట్లను ఈనెల 1వ తేదీ నుంచే టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకునే వీలుండగా.. పరీక్ష ప్రారంభం అయ్యే వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉండనుంది. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచే అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రం గేట్ 10గంటల తర్వాత మూసివేసి ఆ తర్వాత వచ్చే వారిని లోపలికి ప్రవేశించేందుకు అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. అభ్యర్థులు పరీక్ష సమయం పూర్తయ్యే వరకు హాల్ నుంచి బయటకు రానివ్వరని తెలిపారు.

ఇవీ.. తీసుకురావొద్దు

అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి క్యాలికులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్, టాబ్లెట్లు, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, మేథమెటికల్ టేబుళ్లు, లాగ్ బుక్‌లు, లాగ్ టేబుళ్లు, రైటింగ్ ప్యాడ్‌లు తీసుకెళ్లొద్దు. ఏదైనా ఇతర గాడ్జెట్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లేదా రికార్డింగ్ సాధనాలను అనుమతించరు. బయోమెట్రిక్ విధానంలో హాల్‌లోకి అనుమతించనున్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ, తాత్కాలిక టాటూలతో రావొద్దని సూచిస్తున్నారు.

వివరాలు తెలుసుకోవడానికి అందుబాటులో ఫోన్ నంబర్

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సంబంధించిన వివరాలతోపాటు ఇతర వివరాలు తెలుసుకోవడానికి హెల్ప్ లైన్ నంబర్‌ను జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంచింది. అన్ని పనిదినాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 8గంటల వరకు 6281492368 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఈనెల 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ –1 పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ అధికారులు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో వికలాంగుల కోసం సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రానికి, తిరిగి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్‌ను తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో ఉన్న అధికారులు నిబద్ధతతో బాధ్యతాయుతంగా పనిచేయాలని, చిన్నపొరపాటు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అభ్యర్థులు పరీక్షకు వచ్చేటప్పుడు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో ప్రశ్నాపత్రాలు బయటకు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జెడ్పీ సీఈఓ వివి.అప్పారావు, డీఈఓ అశోక్, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ వెంకటేశమ్, పరీక్షల విభాగం పర్యవేక్షకులు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సూర్యాపేట కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్ శ్రీ

- జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ

చివ్వెంల(సూర్యాపేట) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుత జీవన విధానంలో అడవులు తగ్గ ముఖం పడుతున్నాయని దీని వల్ల భావితరాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, జిల్లా న్యాయసేవాధికార సభ్యులు జే.శశిధర్, అశోక్, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ద్వారబంధనం చేశారు.



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


మహిళ మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులో దంతాలపల్లి–సూర్యాపేట రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపురం గ్రామ స్టేజీ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న గుర్తుతెలియని మహిళ(45)ను మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు మహిళ తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతురాలు కాషాయం రంగు చీర, తెలుపు, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించిందని, చామనఛాయ రంగులో ఐదు అడుగుల ఎత్తు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ బి. వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 8712686031 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

తాళం వేసిన ఇంట్లో నగదు, బంగారం చోరీ


ఇంటిని పరిశీలిస్తున్న క్లూజ్ టీం

అడవిదేవులపల్లి: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు నగదు, బంగారం చోరీ చేశారు. ఈ సంఘటన అడవిదేవులపల్లి మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుఝామున చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన కోళ్ల మహేష్ కుమార్తెకు జ్వరం రావడంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఆస్పత్రికి కుటుంబ సభ్యులతో కలిసి తీసుకెళ్లారు. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చేసరికి మెయిన్ డోర్ తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.78వేల నగదుతో పాటు రెండు తులాల విలువ గల బంగారు చైన్, దిద్దులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు నల్లగొండ క్లూస్ టీంకు సమాచారం ఇవ్వగా వారు ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


దగ్ధమైన ఇంట్లోని వస్తువులు

మఠంపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. యాతవాకిళ్ల గ్రామానికి చెందిన నిరుపేద కూలీ ఉప్పెల్లి వెంకన్న, అతడి భార్య కలిసి వారుంటున్న పూరిల్లుకు తాళం వేసి పని నిమిత్తం హుజూర్‌నగర్‌కు వెళ్లారు. వారి ఇంటి పైనుంచి వెళ్లిన విద్యుత్ తీగల వలన షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పురవ్వలు పూరిల్లుపై పడటంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఇంట్లోని బియ్యం, వంట సామగ్రి, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ ఘటనపై మఠంపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహ రాజు కోరారు.


నల్లగొండలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రం వద్ద కరచాలనం చేస్తున్న రాకేష్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న


నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాములలో స్ట్రాంగ్‌రూం నుంచి కౌంటింగ్ కేంద్రంలోకి బ్యాలెట్ బాక్స్‌లను తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది


ఆయా పార్టీల కౌంటింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి కౌంటింగ్ కేంద్రంలోకి పంపిస్తున్న పోలీసు సిబ్బంది

నకిలీ విత్తనాల ముఠా అరెస్టు

- 74 కిలోల పత్తి విత్తనాలు, 300 లీటర్ల నిషేధిత గడ్డిమందు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటటౌన్: నకిలీ పత్తి విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత గడ్డి మందులు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో తిరుమలగిరి మండలానికి చెందిన ఇద్దరు నిందితులు, అర్వపల్లికి చెందిన ఓ వ్యక్తి ఉన్నారు. వీరి నుంచి 74 కిలోల పత్తి విత్తనాలు, 300 లీటర్ల నిషేధిత గడ్డిమందు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు చెందిన నాగమల్లేశ్వర్‌రావు వద్ద తిరుమలగిరికి చెందిన అనంతరెడ్డి తక్కువ ధరకు నకిలీ పత్తి విత్తనాలు తీసుకుని అదే గ్రామానికి చెందిన సంకేపల్లి సోమిరెడ్డి, ఈదుల పర్రె తండాకు చెందిన గుగులోత్ ప్రేమ్‌కుమార్‌లకు విక్రయిస్తాడు. ఇద్దరూ కలిసి ఈ పత్తి విత్తనాలకు గడ్డి మందుకు తట్టుకునే శక్తి కలిగి ఉండటంతో పాటు పత్తి దిగుబడి అధికంగా వస్తుందని, ఎక్కువ సార్లు కలుపు తీయాల్సిన అవసరం లేదని చెప్పి రైతులకు అంటగడుతుంటారు. సమాచారం అందుకున్న తిరుమలగిరి పోలీసులు సోమిరెడ్డి, ప్రేమ్‌కుమార్ ఇళ్లలో దాడులు నిర్వహించారు. ఈమేరకు రూ.1.25లక్షల విలువైన 52కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రూ.3.50లక్షల విలువ గల 300 లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ టీమ్ పని చేస్తుందని తెలిపారు. గతంలో ఈ రకమైన నేరాలకు పాల్పడ్డ నిందితులపై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే తక్షణమే 87126 86026 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కేసులో బాగా పనిచేసిన టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, తిరుమలగిరి, అర్వపల్లి పోలీసులను అభినందించారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ రవి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ లు సత్యనారాయణ, యాకూబ్ పాల్గొన్నారు.

అర్వపల్లిలో 22 కిలోల నకిలీ విత్తనాలు సీజ్

అర్వపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడూరు గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న నిందితుడిని అర్వపల్లి పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.66వేల విలువ గల 22కిలోల పత్తి విత్తనాలు, సీజ్ చేశారు. కోడూరు గ్రామానికి చెందిన పేర్ల వెంకన్న, తన అన్న అయిన పేర్ల బుచ్చయ్యతో కలిసి అదే గ్రామానికి చెందిన కంకరబోయిన ప్రసాద్ అనే వ్యక్తి వద్ద సుమారు 15 రోజుల క్రితం నకిలీ పత్తి విత్తనాలు కొంత మొత్తంలో కొనుగోలు చేశాడు. పేర్ల వెంకన్న ఇంటి వద్ద నకిలీ విత్తనాలు నిల్వ ఉన్నాయన్న సమాచారంతో అర్వపల్లి పోలీసులు దాడులు చేసి వెంకన్నను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా.. పేర్ల బుచ్చయ్య, ప్రసాద్ ఇద్దరూ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

గ్రీన్ క్లబ్ ట్రస్ట్‌కు గ్రీన్ చాంపియన్ అవార్డు

సూర్యాపేట: పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన జిల్లా కేంద్రంలోని గ్రీన్ క్లబ్ ట్రస్టుకు అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ చాంపియన్ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ప్రెసిడెంట్ ముప్పారపు నరేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్‌లు రాష్ట్ర పర్యావరణ, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో మీలా జయదేవ్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

పిడుగుపాటుకు 20 మేకలు, ఎద్దు మృతి


పెద్దవూర పూల్యాతండాలో మృతిచెందిన మేకలు


కనగల్: కుక్కల దాడిలో మృతిచెందిన మేకలు

పెద్దవూర: పిడుగుపాటుకు గురై 20 మేకలు, ఒక ఎద్దు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి పెద్దవూర మండలంలో జరిగింది. వివరాలు.. పెద్దవూర మండలంలోని నీమానాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పూల్యాతండాకు చెందిన కొందరు రైతులు పెంట కోసం తమ వ్యవసాయ పొలాల్లోకి మేకలు, గొర్రెల మందను తోలారు. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు మందలోని 20 మేకలు సమీపంలోని చెట్ల కిందకు వెళ్లాయి. ఈ క్రమంలో వాటిపై పిడుగుపడింది. దీంతో రమావత్ శ్రీనుకు చెందిన 4 మేకలు, రమావత్ సక్రుకు చెందిన 5 మేకలు, రమావత్ మత్రుకు చెందిన 2 మేకలు, మునికి చెందిన 2, బాలోజీకి చెందిన 4 మేకలతో పాటు మరో ముగ్గురికి చెందిన ఒక్కో మేక మృత్యువాత పడ్డాయి. అదేవిధంగా కుంకుడుచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని నెరటోనిగూడెం గ్రామానికి చెందిన నీరుటి సైదయ్య తనకున్న రెండు ఎద్దులను రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు కట్టేసి ఇంట్లో నిద్రించాడు. వేప చెట్టుపై పిడుగుపడటంతో రెండు ఎద్దులలో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో 11 మేకలు మృతి..

కనగల్: కుక్కల దాడిలో 11 మేకలు మృతిచెందాయి. ఈ ఘటన కనగల్ మండల పరిధిలోని రేగట్టె గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రేగట్టె గ్రామానికి చెందిన లోయపల్లి శంకర్ రోజుమాదిరిగానే మంగళవారం తన మేకలను మేపి కొరటికల్ రోడ్డులో గల తన వ్యవసాయ బావి వద్ద దొడ్డిలోకి తోలి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దొడ్డి కంచెను కుక్కలు తొలగించి మేకలపై దాడి చేయడంతో అవి అక్కడికక్కడే మృతిచెందాయి. మంగళవారం ఉదయం వ్యవసాయబావి వద్దకు వెళ్లిన శంకర్ మేకలు మృతిచెందినట్లు గుర్తించాడు. మృతిచెందిన మేకల విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

యువతి అదృశ్యం

హుజూర్‌నగర్: పట్టణంలోని సీతారాంకాలనీకి చెందిన యువతి అదృశ్యమైందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంకాలనీకి చెందిన మొఘల్ పర్వీన్ ఈ నెల 1వ తేదీన హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో తన బంధువులను చేసేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తన కుమార్తె అస్మా కనిపించలేదు. ఎక్కడ వెతికినా అస్మా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పర్వీన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. 10 మందిపై కేసు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనలో పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచిన ఆనందంలో గ్రామంలో మంగళవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. అనంతరం దొండపహాడ్ వెళ్లి ర్యాలీకి తీస్తుండగా ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మా గ్రామంలో ఎందుకు ర్యాలీ తీస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

బైక్ రైడ్‌తో రికార్డు సృష్టించిన యువకులు

- ప్రపంచంలోనే ఎత్తైన మోటరబుల్ ప్రాంతానికి వెళ్లిన నల్లగొండ జిల్లా యువకులు

నార్కట్‌పల్లి: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటరబుల్ పాస్(వాహనాలు వెళ్లగలిగే ఎత్తైన ప్రదేశం) వద్దకు బైక్‌లపై వెళ్లి రికార్డు సృష్టించారు నల్లగొండ జిల్లా యువకులు. ఈ వీడియోను యూట్యూబ్‌లో అప్లోడ్ చేయడంతో వారి ధైర్యసాహసాలను పలువులు ప్రశంసిస్తున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన సుంకరి శ్రీనాథ్‌రెడ్డి, విసం గణేష్, నల్లగొండకు చెందిన బత్తిని అజయ్ మే 12వ తేదీన నార్కట్‌పల్లి నుంచి సొంత బైక్‌లపై బయల్దేరి కేంద్రపాలిత ప్రాంతమైన లదాఖ్‌లోని ఉమ్లింగ్ లాలో 19,024 అడుగుల ఎత్తులో గల ఎత్తైన మోటరబుల్ పాస్‌కు 12 రోజుల్లో చేరుకున్నారు. ఈ క్రమంలో వీరు ఢిల్లీ, శ్రీనగర్, లే–లదాఖ్ హైవే మీదుగా పాకిస్తాన్ బార్డర్‌కు ఉత్తరాన, చైనా బార్డర్‌కు తూర్పున ఉన్న ఈ ప్రాంతానికి చేరేందుకు 3వేల కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలిపారు. ఈ బైక్ రైడ్‌లో తాము రానుపోను 21 రోజుల పాటు 7వేల కిలోమీటర్లు ప్రయాణించామని, నల్లగొండ జిల్లా నుంచి ఈ ప్రాంతానికి ప్రప్రథమంగా తామే వెళ్లినట్లు వారు పేర్కొన్నారు.



ఎత్తైన మోటరబుల్ పాస్ వద్ద మరో స్నేహితుడితో శ్రీనాథ్‌రెడ్డి, గణేష్, అజయ్

కారు షోరూంలో చోరీ

మిర్యాలగూడ అర్బన్: కారు షోరూంలో దొంగలు చొరబడి రూ.3.77లక్షలు ఎత్తుకెళ్లారు. బుధవారం మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణ పరిధిలోని నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్ రోడ్డులో గల పవన్ మోటార్స్ కారు షోరూంలో పనిచేసే అకౌంటెంట్ దుస్సా రేణు ఈ నెల 2వ తేదీన రూ.3.77 లక్షల నగదును క్యాష్ కౌంటర్‌లోని ఇనుప లాకర్‌లో భద్రపరిచి ఇంటికి వెళ్లింది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి 3వ తేదీ తెల్లవారుజామున షోరూం షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి లాకర్‌ను ధ్వంసం చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం షోరూం శుభ్రపరిచేందుకు వచ్చిన స్వీపర్ రమణ లాకర్ పగిలి ఉండటాన్ని గమనించి అకౌంటెంట్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో అక్కడకు చేరుకున్న అకౌంటెంట్ రేణు చోరీ జరిగిన తీరును పరిశీలించి పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు షోరూం వద్దకు చేరుకుని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. ఇద్దరు వ్యక్తులు చోరీ చేసినట్లు అందులో రికార్డయ్యింది. అకౌంటెంట్ రేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.


సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయిన చోరీ దృశ్యాలు

అత్యాచార నిందితులకు 14 రోజుల రిమాండ్

నేరేడుచర్ల: మానసిక వికలాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు హుజూర్‌నగర్ కోర్టు బుధవారం 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. వివరాలు.. నేరేడుచర్ల మండలం లాల్లక్ష్మీపురం గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన వాసరాసి రాములు(64), యడవెల్లి యాదగిరి(64)ని పోలీసులు అరెస్ట్ చేసి హుజూర్‌నగర్ కోర్టులో హాజరుపర్చగా.. వారిద్దరికి 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించాలని కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్ఐ తెలిపారు.

మాట నిలబెట్టుకున్నాడు!

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలకపాత్ర
- ఎన్నికల ఇన్‌చార్జిగా అన్నీ తానై నడిపించిన ఎమ్మెల్యే
- పదోన్నతి ఎప్పుడోనని కార్యకర్తల్లో చర్చ

సాక్షి, యాదాద్రి : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నేరవేర్చారు. అన్నీ తానై నడిచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. కాగా అభ్యర్థి విజయంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చేనా.. అనే చర్చ జరుగుతోంది.

రాజగోపాల్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వచ్చి భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. అప్పటి వరకు భువనగిరి లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మారుస్తూ రాజగోపాల్‌రెడ్డికి ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డి కోరిక మేరకు రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని తన భుజాలపై వేసుకున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేసి కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్ షోలలో అభ్యర్థితో పాటు ఆయా నియోజకవర్గాల పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అసమ్మతి నేతలను బుజ్జగించి పార్టీ విజయం కోసం పని చేయించారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా తనకున్న వ్యక్తిగత పరిచయాలతో ఇతర పార్టీల నాయకుల సహకారం కూడా తీసుకున్నారు. ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను సమన్వయం చేసుకొని ముందుకు సాగారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని భువనగిరిలో జరిగిన ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. హామీ మేరకు రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఎప్పుడు ఇస్తారోనని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అయిలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యేలు, చామల

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామేల్, మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా గెలుపొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అన్ని తానై నడిపించిన రాజగోపాల్‌రెడ్డికి, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

మూర్ఛతో మురుగుకాల్వలో పడి వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్: మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన చామల శ్రీనివాస్(43) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను గత రెండేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. దానికి తోడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ పట్టణంలోని పాత నవత ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం సమీపంలో మురుగుకాల్వపై కూర్చొని ఉండగా మూర్ఛ రావడంతో అందులో పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వచ్చి అతడిని మురుగుకాల్వ నుంచి బయటకు తీసి సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

తేలు కాటుకు గురైన మహిళా కానిస్టేబుల్

- నల్లగొండలోని ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ కేంద్రం వద్ద ఘటన

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద గల ఎఫ్‌సీఐ గోదాములలో జరుగుతున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ బుధవారం రాత్రి తేలు కాటుకు గురైంది. మీడియా సెంటర్ సమీపంలో విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మి తేలు కాటుకు గురికావడంతో వెంటనే అక్కడున్న వారు 108 వాహనంలో చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సరైన మెళకువలతో పత్తిలో అధిక దిగుబడి

- ఇన్‌చార్జి ఏడీఏ పి. సందీప్

పెద్దవూర: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పత్తి సాగు చేసే రైతులు సరైన మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఇన్‌చార్జి ఏడీఏ పి. సందీప్ తెలిపారు. పత్తి సాగుకు సంబంధించి ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.



పాడి పంట

- పత్తి పంటను నల్లరేగడి భూముల్లో 60–70 మిల్లీ లీటర్లు, ఎర్ర భూముల్లో 50–60 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైనప్పుడు జూలై 15వ తేదీ వరకు విత్తుకోవాలి.
- వర్ష సూచన దృష్టిలో పెట్టుకుని గ్రామంలోని రైతులందరూ వీలైనంత వరకు ఒకేసారి విత్తుకుంటే బాగుంటుంది.
- ఒకే హైబ్రిడ్ విత్తనాల మీద ఆధారపడకుండా వివిధ రకాల హైబ్రిడ్ విత్తనాలను విత్తుకోవాలి. తక్కువ కాల పరిమితి గల హైబ్రిడ్ రకాలను వాడటం వల్ల గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించవచ్చు.
- తేలికపాటి భూముల్లో నాన్ బీటీ రకాలైన ఏ.డీ.బీ 542 మరియు ఏ.డీ.బీ.39 విత్తనాలను 80:20 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.
- పత్తిలో అంతర పంటగా కందిని 6/8 వరుసలకు ఒకసారి వేసుకోవాలి.
- సూటి రకాలలో కిలో విత్తనాలకు పురుగు మందులైన 5 గ్రాములు ఇమిడక్లోప్రిడ్ లేని పక్షంలో 4 గ్రాముల థయోమిథాక్సం, అలాగే తెగులు మందులైన 10 గ్రాములు ట్రైకోడర్మ విరిడి, 10 గ్రాముల సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌ను కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ప్రైవేట్ హైబ్రిడ్లకు కూడా శిలీంధ్రనాశిని మందులైన కార్బాక్సిన్ థైరమ్ 2.5 గ్రాములను కిలో విత్తనంతో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- కాంప్లెక్స్ ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో పైపాటుగా వేయరాదు.
- పత్తి విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 లింగార్షక బుట్టలను(ట్రాప్స్) అలాగే నియంత్రించడానికి ఎకరాకు 8 లింగార్షక బుట్టలను ఏర్పరచాలి.
- సిఫారసు చేసిన భాస్వరం మొత్తాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో (రకాలకు 100 కిలోలు, హైబ్రిడ్‌లకు 150 కిలోలు) ఎకరానికి ఆఖరి దుక్కిలో వేయాలి. పైపాటుగా సూటి రకాలను 25 కిలోల నత్రజనితో 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 3సార్లు అనగా 30 రోజులు, 60 రోజులు, 90 రోజులలో, సంకర రకాలకు(హైబ్రిడ్లకు) అదే మోతాదులో 4 సార్లు 20, 40, 60, 80 రోజులకు అందించాలి.
- అంతర్గత కాయకుళ్లు తెగులు ఏర్పడిన ప్పుడు కానీ, గాలిలో తేమ ఎక్కువ ఉన్నప్పుడు, జల్లులు పడినప్పుడు, పూత కాయ తయారయ్యే దశలో 60 నుంచి 90 రోజుల దశలో లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో 0.1 గ్రాముల ప్లాన్టోమైసిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- పత్తి పంట కాలాన్ని ఆరు నెలలకు మించి పొడగించరాదు. నీటి వసతి ఉన్నట్లైతే పత్తి తర్వాత వేసవిలో నువ్వులు, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న వంటి పంటలను వేసుకోవచ్చు.
- పురుగు నష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె 1500 పీపీఎం ను కలిపి పిచికారీ చేయాలి.
- 2 మిల్లీ లీటర్ల క్వినాల్‌ఫాస్ లేనిపక్షంలో 1.5 గ్రాముల థయోడికార్బ్ లేదా 2 మిల్లీ లీటర్ల ప్రొఫెనోఫాస్ లేదా 2.5 మిల్లీ లీటర్ల క్లోరిపైరిఫాస్ లేదా 0.5 గ్రాముల ఇమమెక్టిన్ బెంజోయేట్ మందును కలిపి పిచికారీ చేసి గులాబీ రంగు పురుగును నియంత్రించవచ్చు.
- పంట చివరి దశలో లీటరు నీటికి 1 మిల్లీలీటరు సైపర్‌మిత్రిన్ లేదా 1 మిల్లీలీటరు లామ్డా సైహలోత్రిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- కాయకుళ్లు తెగులు కన్పించినట్లైతే లీటర్ నీటికి 3 గ్రాముల ప్రేరక్లోస్ట్రోబిన్‌తో మెథిరాం లేదా 0.6 గ్రాముల ఫ్లక్సాపైరనోడ్‌తో పైరక్లోస్ట్రోబిన్ లేదా 1 మిల్లీ లీటర్ అజోక్సోస్ట్రోబిన్, డైఫెనకోనజోల్‌ను కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.